

కోనసీమ అందాలు..




కడియం నర్సరీలు


కోర్డెలియా షిప్ క్రూయిజ్

ప్రగతి పీఠిక..

విశాల సముద్ర తీరం.. పోర్టులు.. నర్సరీలు.. కొబ్బరి.. అరటి.. పామాయిల్.. పౌల్ట్రీ.. గ్యాస్ నిక్షేపాలు.. అబ్బురపరిచే పర్యాటక అందాలు.. ఇలా ఒకటేంటి ఉమ్మడి తూ.గో. జిల్లాలో అపార వనరులు ఎన్నో.. వీటిని మరింత సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధిలో ఆకాశమంత ఎత్తుకు ఎదగడానికి ఎన్నో అవకాశాలున్నాయి. తద్వారా ప్రజల ఆదాయం అమాంతం పెంచి అభివృద్ధి పథంలో నడిపించేందుకు మార్గాలున్నాయి. ఇప్పుడు సీఎం చంద్రబాబు దీనిపైనే దృష్టిసారించారు. కొత్తగా విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను సృష్టించి అందులో ఉమ్మడి తూ.గో.ని చేర్చారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వేటికవే ప్రత్యేకతలున్నందున ఆయా అంశాల్లో ఈ మూడు జిల్లాలను అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రత్యేక విజన్ ప్లాన్ తయారుచేశారు. 2032 నాటికి ఈ మూడు జిల్లాల్లో సమూల మార్పులు వచ్చేలా ప్రణాళికలు తయారు చేశారు.

అభివృద్ధి సూచిక!

- విశాఖ ఎకనమిక్ రీజియన్ విజన్ ప్రణాళికలో ఉమ్మడి జిల్లాకు పట్టం
- కాకినాడ, కోనసీమ, తూ.గో. జిల్లాల్లో భారీ అభివృద్ధి ప్రణాళికలు
- కాకినాడలో 2 వేల ఎకరాల్లో ఆక్వా పార్కు.. కేజీ బేసిన్‌లో ఉత్పత్తి రెట్టింపు
- కడియం నర్సరీలను దేశ నర్సరీ రాజధానిగా మార్చేలా ప్రతిపాదనలు
- 2 వేల ఎకరాల్లో పాలీహౌస్‌లు, టిస్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్
- సినిమా షూటింగ్‌లు, రివర్ క్రూయిజ్‌లను ప్రోత్సహిస్తే కోనసీమకు మహర్దశ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ.. ప్రగతి జాడ..

7.4 బిలియన్ డాలర్ల జీడీడీపీతో 2.2 మిలియన్ జనాభా ఉన్న కాకినాడ జిల్లాలో సుదీర్ఘ సముద్ర తీరం.. ఓడరేవు, పరిశ్రమలకు నెలవు. ఈ జిల్లాను ఆయా రంగాల్లో మరింత ఎత్తుకు తీసుకువెళ్లేలా విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికలో ప్రస్తావించారు. ఇందులోభాగంగా 200ఎకరాల్లో తీర ప్రాంతంలో ప్రభుత్వం ఆక్వా పార్కును ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే ఇక్కడ త్వరలో 1 ఎంఎంటీపీఏ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటుకాబోతోంది. అలాగే 2 గిగావాట్ల ఎలక్ట్రొలైజర్ ఉత్పత్తి చేయబోతున్నారు. తద్వారా కాకినాడ అభివృద్ధి చెందడంతోపాటు ఇక్కడ తయారయ్యే గ్రీన్ అమ్మోనియాలో 0.25 మిలియన్ మెట్రిక్ టన్నులు విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఇక్కడున్న కేజీ బేసిన్ దేశంలో 35 శాతం గ్యాస్ అవసరాలు తీర్చుతోంది. లక్షల కోట్లు టర్నోవర్ జరిగే బేసిన్‌లో మున్ముందు గ్యాస్, చమురు అన్వేషణ పెంచి కొత్త బ్లాక్‌లు తవ్విస్తే రీజియన్ ఆర్థికంగా మరింత బలోపేతమవుతుంది. అలాగే కాకినాడ నుంచి శ్రీకాకుళం వరకు గ్యాస్ పైపులైన్ నిర్మాణం ఇప్పటికీ జరగలేదు. 20-30 ఎంఎంఎస్‌సీఎంఈ సామర్థ్యంతో దీన్ని వచ్చే ఏడాదిలోగా పూర్తి చేసేలా ప్రణాళికలు రచించారు. ఇందుకు 100 నుంచి 150 మిలియన్ డాలర్లు అవసరమని అంచనా. తద్వారా ఇంటింటి గ్యాస్ అవసరాలను రీజియన్ మొత్తానికి తీర్చవచ్చు. అలాగే కాకినాడలో ప్రత్యేక గ్యాస్ టెర్మినల్ నిర్మించాలని ప్రతిపాదించింది. 20-30 ఎంఎంఎస్‌సీఎండీ సామర్థ్యంతో 2028-2030కి దీన్ని పూర్తి చేయాలని పేర్కొంది. ఈ రీగ్యాసిఫికేషన్ యూనిట్‌కు 900 మిలియన్ నుంచి 1 బిలియన్ ప్రైవేటు పెట్టుబడులు అవసరమని పేర్కొంది. అలాగే ప్రస్తుతం కాకినాడ డీప్‌వాటర్ పోర్టు 26 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో (ఎంఎంటీపీఏ) సామర్థ్యంతో పనిచేస్తోందని, 2032 నాటికి 63 ఎంఎంటీపీఏకు సామర్థ్యం పెంచాలని పేర్కొంది. అలాగే ఇక్కడున్న ప్రభుత్వ యాంకరేజ్ పోర్టు సామర్థ్యం 4 నుంచి 5కి, రాబోతున్న గేట్‌వే పోర్టు సామర్థ్యం 16 ఎంఎంటీపీఏకు పెంచాల్సి ఉందని గుర్తించింది. అలాగే కాకినాడలో నౌకల తయారీ రంగం అంతంత మాత్రంగానే ఉందని నివేదిక పేర్కొంది. ఓ ప్రైవేటు యార్డు ద్వారా ఏటా 4 వేల నుంచి 5వేల గ్రాస్ టన్నుల తయారీ జరుగుతోందని, వసతులు పెంచి అదనంగా పది వేల గ్రాస్ టన్నుల తయారీ పెంచాలని ప్రతిపాదించింది. అలాగే జిల్లాలో ప్రైవేటు రంగంలో 5,600 ఎకరాల్లో మల్టీప్రాడక్ట్ పార్క్ ఏర్పాటుచేయాలని ప్రణాళిక సిద్ధంచేసింది. బుద్ధిస్ట్, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని పరుగులు తీసేలా పలు సూచనలు చేసింది. ఏటా అన్నవరం దేవాలయానికి 1 మిలియన్, ద్రాక్షారామ 0.2 మిలియన్, పిఠాపురం 0.1 మిలియన్ భక్తులు వస్తున్నారని, ఇది భారీగా పెరిగేలా సన్నద్ధం చేయాలని పేర్కొంది. భవిష్యత్తు అవసరాల్లో భాగంగా పారిశ్రామిక రంగంలో పనిచేసే వారి అవసరాలకు 1,500 ఎకరాల్లో క్లీన్ టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ సిటీ ప్రతిపాదించారు. అలాగే కాకినాడ-మూలపేట బైపాస్ రోడ్డు, విశాఖ-కాకినాడ 125 కి.మి. కోస్టల్ రోడ్డు ద్వారా అన్ని పోర్టులకు అనుసంధానం పెంచి కార్గో రవాణా భారీగా పెంచాలని వ్యూహం రచించారు.

తూ.గో.. నర్సరీల రాజధానిగా..

విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో అత్యధిక జీవీఏ ఉత్పత్తితో తూర్పుగోదావరి జిల్లా ఉంది. 2024 ఆర్థిక సంవత్సరానికి గాను 2.4 బిలియన్ జీవీఏ నమోదుచేసింది. కాకినాడ జిల్లా 2.2 బిలియన్, కోనసీమ 1.9 బిలియన్‌గా ఉంది. వార్షిక జీడీడీపీ 6.8 బిలియన్లతో రెండు మిలియన్ల జనాభా ఉన్న ఈ జిల్లా గుడ్లు, నర్సరీ కేంద్రంగా కొనసాగుతున్నట్టు నివేదిక గుర్తించింది. భవిష్యత్తులో ఇక్కడ ఐసీఏఆర్ లేదా సీఏఆర్‌ఐ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. కోళ్లు రకరకాల వ్యాధులు తట్టుకునేలా ఈ పరిశోధన కేంద్రం అడుగులు వేయాలని సూచించింది. అలాగే క్రూడ్ పామాయిల్ ఉత్పత్తిలో ఈ జిల్లా 15 శాతం, కాకినాడ 9 శాతంతో టాప్‌లో ఉన్నాయని వివరించింది. భవిష్యత్తులో ఈ ఉత్పత్తి పెరిగితే మరింత ఆదాయం వస్తుందని సూచించింది. అరటి ఉత్పత్తి కూడా ఈ జిల్లాలో అధికంగా ఉన్న నేపథ్యంలో కొవ్వూరులో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. నర్సరీ సాగులో ఈ జిల్లా లీడర్‌గా ఉందని దేశ నర్సరీల రంగానికి ఈ ప్రాంతం రాజధాని కానుందని విశ్లేషించింది. 5,500 హెక్టార్లలో సాగవుతున్న నర్సరీల ద్వారా ఏటా 100 మిలియన్ డాలర్ల జీవీఏ వస్తుండగా, 50వేల మందికి ఉపాధి లభిస్తోంది. కానీ ఎగుమతులు 2 శాతం లోపే ఉన్నాయని, 2032 నాటికి ఎగుమతులు 15 శాతం పెంచడానికి ఆస్కారం ఉందని తెలిపింది. ఆర్నమెంటల్, అవెన్యూ మొక్కల ఎగుమతికి ఆస్కారం ఉందని తెలిపింది. నర్సరీల్లో ఆధునిక పద్ధతులు వాడి జీవీఏను 2032 నాటికి 200 మిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొంది. అంటే సాగు 40 శాతం పెరగాలని తెలిపింది. 15 శాతం ఎగుమతులు పెంచితే 120మిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని విజన్ ప్రణాళికలో తెలిపింది. ఇందుకోసం 2వేల ఎకరాల్లో నర్సరీ జోన్‌లు ఏర్పాటుకు ప్రతిపాదించింది. పాలీహౌస్‌లు, టిష్యూ కల్చర్ ల్యాబ్‌లు, రోబోటిక్ గార్డెన్‌తోపాటు శీతల గిడ్డంగుల వసతి కల్పించాల్సి ఉందని తెలిపింది. అలాగే పర్యాటక రంగం మరింత ఎదగడానికి ఈ జిల్లాకు చాలా అవకాశాలున్నాయని, పర్యాటకుల కోసం 6 నుంచి 12 గంటల వ్యవధిలో లాంగ్ హాప్-ఆన్ హాప్-ఆఫ్ రివర్ క్రూయిజ్ పర్యాటకం ప్రోత్సహించాలని పేర్కొంది. రాజమండ్రి-భద్రాచలం, కాకినాడ-దిండి మార్గాల్లో టర్కీ మోడల్ క్రూయిజ్ నడపాలని ప్రతిపాదించింది. భద్రాచలం-రాజమండ్రి లోకల్ సైట్ సీయింగ్, కాకినాడ-దిండి బ్యాక్ వాటర్ లీజర్ క్రూయిజ్‌లు నడపాలని సూచించింది. అలాగే భవిష్యత్తులో ద్రాక్షారామ, పిఠాపురంలో 250 చొప్పున హోటల్ గదులు, అన్నవరం 500 గదులు రావాలని ప్రతిపాదించింది. ఏటా జూలైలో గోదావరి యాత్ర ఏడు రోజులు, నవంబరులో ఏడు రోజులు కాకినాడ బీచ్ ఫెస్టివల్ నిర్వహించాలని తెలిపింది.


కొబ్బరి కేంద్రం.. కోనసీమ

కొబ్బరి పంటకు కేంద్రంగా కోనసీమ జిల్లా ఉందని నివేదికలో నీతిఆయోగ్ వెల్లడించింది. 5.1 బిలియన్ జీడీడీపీతో 1.8మిలియన్ జనాభా ఉన్న జిల్లా ప్రకృతి అందాలకు, గోదావరి, సముద్రం బ్యాక్ వాటర్స్‌కు పెట్టింది పేరని తెలిపింది. ఈ నేపథ్యంలో సినిమా చిత్రీకరణలకు రాజధానిగా జిల్లాను మార్చాలని ప్రతిపాదించింది. సముద్రంలో నాచు పెంపకంతో ఇక్కడ భారీగా ఆదాయం రాబట్టవచ్చని తెలిపింది. కోనసీమలో కోకోనట్ రీసెర్చ్ స్టేషన్ సామర్థ్యం పెంచాలని సూచించింది.

పెట్టుబడులతో రండి!

- కాకినాడలో నాఫ్తాకాంప్లెక్స్, పాలిమర్స్ యూనిట్ ఏర్పాటు చేయండి
- ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చించిన సీఎం
- షిప్ క్రూయిజ్ సర్వీసులపై కోర్డెలియాతో సంప్రదింపులు

కాకినాడలో నాఫ్తా కాంప్లెక్స్, పాలిమర్స్ కంపెనీ ఏర్పాటుచేయడానికి ముందుకు రావాలని ఎల్‌జీ కెమికల్స్ కంపెనీని సీఎం చంద్రబాబు కోరారు. రెండో రోజు విశాఖలో పెట్టుబడుల సదస్సులో భాగంగా సీఎం ఎల్‌జీ కెమికల్స్ కంపెనీతో చర్చలు జరిపారు. యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఈ రెండింటిని ఏర్పాటు చేసే విషయమై పరిశీలించాలని కోరారు. ప్లాస్టిక్ రీసైకింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తే అందుకు తగ్గ సహాయసహకారాలు అందిస్తామని వివరించారు. జేఎస్‌డబ్ల్యూ కంపెనీతో కలిసి ఎల్జీ కెమికల్ సంస్థ ఏర్పాటు చేయదలచిన కాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌కు సైతం సహకారం అందిస్తామని పేర్కొన్నారు. వాస్తవానికి అనేక రకాల పరిశ్రమలు నిర్వహించడానికి ఇంధనంగా గ్యాస్ అవసరం. అది అందుబాటులో లేనప్పుడు నాఫ్తాతోను పరిశ్రమలను నడిపించవచ్చు. ఒకవేళ ఎల్‌జీ కంపెనీ నాఫ్తా కాంప్లెక్స్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందిస్తే రూ.60వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని అంచనా. కొరియా దేశానికి చెందిన ఎల్‌జీ కెమికల్స్‌కు పలు దేశాల్లో ఇప్పటికే నాఫ్తా కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మరోపక్క దేశంలో ముంబై, గోవా తదితర ప్రాంతాల్లో సముద్రంలో షిప్ క్రూయిజ్ నిర్వహణలో ప్రఖ్యాతిగాంచిన కోర్డెలియా క్రూయిజ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చర్చలు జరిపారు. కాకినాడ నుంచి విశాఖ-భీమిలికి షిప్ క్రూయిజ్ సర్వీసులు నడపడానికి కలిసిరావాలని కోరారు. కాకినాడ, విశాఖల్లో క్రూయిజ్ టెర్మినల్ సౌకర్యాలు, బీచ్ టూరిజం, వాటర్ అడ్వంచర్ క్రీడల నిర్వహణపై ఆసక్తి చూపుతోంది.



విషాద వీచికలు!

నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

సాఫీగా సాగిపోయే ప్రయాణంలో పెనుతుఫాన్.. రోడ్డు ప్రమాదం. రెప్పపాటులో జరిగిపోయే ఈ ఘోరం.. క్షణాల్లో కుటుంబాన్ని రోడ్డున పడేస్తుంది. ఏదైనా ప్రమాదంలో ఇంటి యజమానిని కోల్పోతే.. ఆ కుటుంబమే చీకట్లోకి చేజారిపోతుంది. ఆర్థికంగా నిట్టనిలువునా చితికిపోతుంది. కొన్నాళ్లకు.. కూడదీసుకుని నిలబడొచ్చు.. లేదా మరింత అంధకారంలోకి దిగబడిపోవచ్చు. లేదా కుటుంబంలో వేరెవరైనా మరణించినా జీవితాంతం వారు లేని వ్యథ వెంటాడుతుంది. కాలం వారిని జీవచ్ఛవాల్లా మార్చేస్తుంది. ఈరోజు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం. ప్రమాదంలో మరణించిన వారి కన్నీటి కథల్లో ఇవి కొన్ని.. 7

తాళం వేసున్నా దోచేస్తారు..

దొంగతనాలు చేస్తున్న ముగ్గురిని పట్టుకున్న కాకినాడ పోలీసులు 7

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు

7

నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల వనసమారాధన

- శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్‌కు రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి సుభాష్ 7

బిర్సాముండాకు కలెక్టరేట్ ఉద్యోగుల నివాళి

అమలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యపాత్ర పోషించడమే కాకుండా గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్పయోధుడు భగవాన్ బిర్సాముండా అని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి అన్నారు. కలెక్టరేట్‌లో బిర్సాముండా 150వ జయంతిని సందర్భంగా చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాధవితోపాటు ఏవో విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్బరాజు, రమణకుమారి, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి శిరీషతోపాటు పలువురు అధికారులు బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. 19వ శతాబ్దపు చివరిరోజుల్లో బీహార్, జార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో బ్రిటీషు కాలంలో జరిపిన మిలినేరియం ఉద్యమానికి బిర్సాముండా సారథ్యం వహించారన్నారు. చిన్నతనంనుంచి బ్రిటీషర్లపై తిరుగుబాటు చేసిన వ్యక్తిగా కొనియాడారు. వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, ఇతర కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

కాపు వనసమారాధనలో కొత్తపేట ఎమ్మెల్యే



అమలాపురంలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణ కాపు కల్యాణ మండపంలో టీడీపీ రాష్ట్రఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబుఆధ్వర్యంలో నిర్వహించిన కాపు వనసమారాధనలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడారు. ఇక్కడ కార్పొరేషన్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పదవులు పొందినవారిని సత్కరించారు

వేసవి నాటికి విద్యుత్ ఉపకేంద్రం పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్


విద్యుత్ ఉప కేంద్రం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

అయినవిల్లి,నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి నాటికి అయినవిల్లిలో నిర్మిస్తున్న 400/132 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణ పనులు పూర్తి చేసి లోఓల్టేజీ లేని విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ విద్యుత్ ఇంజనీర్లను ఆదేశించారు. శనివారం సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం, రికార్డులు, మ్యాప్‌ల ఆధారంగా తనిఖీ చేసి చేపట్టిన పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి నాటికి జిల్లావ్యాప్తంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసే దిశగా పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపకేంద్రానికి వచ్చే మెయిన్ లైన్ 400 కేవీ టవర్ల బేస్‌మెంట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యానికి తావు లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ ప్రాజెక్టు పర్యవేక్షణ ఇంజనీర్ టి.మనోహరరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ వై.పుల్లయ్య, తహశీల్దార్ సీహెచ్ విద్యాపతి, వ్యవసాయశాఖ ఏడీ వెంకటరామారావు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

కేసుల విచారణ పురోగతిలో జాగ్రత్తలు తీసుకోండి

- జిల్లాలో కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షలో ఎస్పీ రాహుల్ మీనా



కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష నిర్వహించిన ఎస్పీ రాహుల్‌మీనా

అమలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విచారణ ప్రక్రియలో ఉన్న క్లిష్టతలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా అధ్యక్షతన అమలాపురం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లతో శనివారం ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కేసుల విచారణ పురోగతిలో కోర్టు కానిస్టేబుళ్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సీసీ, ఎస్సీ నెంబర్లపై కూలంకుషంగా చర్చించారు. ఈ సందర్భంగా జరిగిన కోర్టు కానిస్టేబుల్ సమీక్షలో ఎస్పీ మీనా మాట్లాడుతూ సమర్థవంతమైన విచారణ, కోర్టు కేసుల్లో ఆలస్యం జరగకుండా వేగవంతంగా న్యాయం జరిగేలా కానిస్టేబుళ్లు తమ బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. రికార్డుల నిర్వహణ, కోర్టు కేసులు, చార్జిషీటులకు సంబంధించిన సీసీ మెంబర్లు, ఎస్సీ మెంబర్ల వివరాలను సాక్ష్యాధారాల సమర్పణ విషయంలో పాటించాల్సిన నియమాలను గురించి కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రశ్నించారు. ఈ రికార్డుల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. కోర్టు డ్యూటీల నిర్వహణలో కానిస్టేబుళ్లు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, వృత్తిపరమైన సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమీక్షా సమావేశం ద్వారా కోర్టు విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది పనితీరులో మరింత పారదర్శకత, సమర్థత పెంచడానికి ఉపయోగపడుతుందని సిబ్బంది అన్నారు. ఎస్సీ సీఐ పుల్లారావు, డీసీఆర్బీ సీఐ మురళీకృష్ణ, సోషల్ మీడియా సీఐ తమ్మినాయుడు, కోర్టు మోనటరింగ్ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు సమీక్షలో పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో.. సమాజ ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చు

- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' సదస్సులో కలెక్టర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్

అమలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి తన వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా తన ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా సమాజ ఆరోగ్యాన్ని కూడా రక్షించుకోగలుగుతారని కలెక్టర్ మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అమలాపురం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో సమాజ వ్యక్తిగత పరిశుభ్రత ఇతివృత్తంగా పిల్లలతో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ చేతులు తరచూ సబ్బుతో కడుక్కోవడం, స్నానం చేయడం, వ్యక్తిగత శుభ్రత అలవరచుకోవడంవల్ల అంటువ్యాధుల వ్యాప్తి నుంచి రక్షణ పొందవచ్చునని హితవు పలికారు. అవగాహన సదస్సులో విద్యార్థులతో కలెక్టర్ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. డీఈవో షేక్ సలీంబాషా, ప్రధానోపాధ్యాయుడు కాశి ఘనసత్యనారాయణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒకరోజు ఆదాయం రూ.53.80లక్షలు


భక్తులతో కిక్కిరిసిన వాడపల్లి వెంకన్న ఆలయం

ఆత్రేయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.53.80 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ర్యాలిలో వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణం

ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో శనివారం పద్మావతి అలివేలు మంగసమేత వేంకటేశ్వరస్వామి దివ్యకల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈవో రమణమూర్తి ఏర్పాట్లు చేశారు.

విషాద వీచికలు..



నేడు రోడ్డు ప్రమాద మృతుల స్మృతి దినం

- ఏటా భారీగా రోడ్డు ప్రమాదాలు
- వందల సంఖ్యలో మృతులు.. క్షతగాత్రుల గణాంకాలు
- ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలేంటి?
- రోడ్డున పడుతున్న కుటుంబాలు
- అనాథలుగా మారుతున్న పిల్లలు
- హైవేలపై భారీగా బ్లాక్ స్పాట్స్
- రహదారులపై భద్రత ప్రశ్నార్థకం

చీకటి తర్వాత వెలుగు వస్తుందనేది ఓ ఆశ. ఈరోజు ముగిస్తే రేపు ఉందనేది ఓ భరోసా. అదేవిధంగా ప్రతి మనిషి జీవితంలో వెలుగునీడలు సర్వసాధారణం. ప్రతి కుటుంబంలో కష్టసుఖాలు అంతే సహజం. అయితే ఆశకు, నిరాశకు మధ్య బలమైన నమ్మకమో, విశ్వాసమో భవిష్యత్‌కు దారి చూపిస్తుంది. అదే అందరికీ ఆలంబన. కానీ.. ఒకే ఒక్క ఘటన.. ఓ కుటుంబం పెంచుకున్న ఆశలను తుంచివేస్తుంది. రేపనేది ఏమిటో అర్థం కాని అంధకారంలోకి నెట్టివేస్తుంది. కొందరి జీవితాల్లో చీకటి తర్వాత మళ్లీ వచ్చేది చీకటే. కళ్ల ముందు ఉన్న ఆప్తులు అర్థాంతరంగా మాయమై పోతే.. దుఃఖం కట్టలు తెంచుకుని ఉప్పెనలా చుట్టేస్తుంది. కానీ కొన్నాళ్లకు దుఃఖాశ్రువులు ఇంకిపోవచ్చుగానీ.. అయినవారిని కోల్పోయిన వారికి ఏళ్ల తరబడి విషాద వీచికలు చిగురుటాకులా వణికిస్తూనే ఉంటాయి. ఇవి రోడ్డు ప్రమాద స్మృతులు.. నిద్రలో ఉలిక్కిపడి లేపే పీడ కలలు..

(కాకినాడ/రాజమహేంద్రవరం/(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలు జీవితాలను బుగ్గిపాలు చేస్తున్నాయి. చాలా కుటుంబాలను చిందర వందర చేస్తున్నాయి.అతివేగం, నిర్లక్ష్యం, నిద్రమత్తు, మద్యం సేవించడం..ఇలా కారణం ఏదైనా ఒక్క ప్రమాదంతో అనేకమంది రోడ్డునపడుతున్నారు. చిన్నారులు అనాథలవుతున్నారు.

తాళ్లరేవు మండలంలో ఈ ఏడాది జూలైలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఓ ఆటోను వేగంగా ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు మృతి చెందడంతో బాధిత కుటుంబంలో ఇద్దరు బాలలను అనాథలను చేసింది. ఓ కుటుంబానికి పెద్ద దిక్కును లేకుండా చేసింది. ఓ మహిళను లేవలేని జీవచ్ఛవంలా మార్చింది. మంచానికే పరిమితం చేసింది. నాలుగు ఆపరేషన్లు, కాళ్లు, చేతుల్లో స్టీల్ రాడ్‌లతో ఆమె నరకం అనుభవిస్తూ.. నడవలేని స్థితిలో ఆ మహిళ ఉంది. వీరికి ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్‌యాజమాన్యం నుంచికానీ.. ప్రభుత్వంనుంచి గానీ సాయం అందలేదు. అనేక ప్రమాద ఘటనల్లో ఇదే పరిస్థితి.



రంగంపేట మండలం వడిశలేరు వద్ద లారీని వెనుక నుంచి ఢీకొని నుజునుజ్జయిన కారు

కుటుంబాలను చీకట్లోకి నెట్టి..

రోడ్డు ప్రమాదాలు కొందరి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నాయి. కొన్ని ప్రమాదాల్లో కుటుంబాలను పోషించే పెద్ద దిక్కులు మృత్యువాత పడడంతో కుటుంబాలు రోడ్డునపడుతున్నాయి. యువకులు సైతం ప్రమాదాలబారిన పడి కుటుంబాలను శోకసంద్రంలో ముంచుతున్నారు. మద్యం మత్తు, నిర్లక్ష్యంతో వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతూ తల్లిదండ్రులకు కన్నీళ్లు మిగులుస్తున్నారు. జిల్లాలో ప్రతిఏటా వందల సంఖ్యలో యువకులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

● ప్రమాదాలకు కారణాలివేనా?

బ్లాక్‌స్పాట్లు గుర్తించిన తర్వాత ఆర్ అండ్‌బీ, నేషనల్ హైవేస్, విద్యుత్తు, ఆర్టీఏ, మున్ సిపల్ కార్పొరేషన్, పోలీస్ విభాగాల పాత్ర ఎక్కువ. విద్యుత్తు, రోడ్డు మార్కింగ్‌లు, బోర్డుల ఏర్పాటు ఆ శాఖల పనే. శాఖల మధ్య సమన్వయ లోపం, రక్షణ పనుల్లో అలసత్వంవల్ల బ్లాక్ స్పాట్లు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. వాహనదారులు అతివేగం, నిద్రమత్తు, మద్యం సేవించి వెళ్లడం, వాహనాలు కండీషనల్‌లో లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

● ఇలా చేస్తే..

హైవేలు లేదా రెండు లేన్లు, సింగిల్ లేన్(వరుస) రోడ్లపై వాహదారులకు ఏవి ఎటు వెళ్లాలి.. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రోడ్లపై పార్కింగ్ చేసే వాహనాలపై కఠినంగా వ్యవహరించవచ్చు. రాత్రి వేళల్లో వాహనాల డ్రైవర్ల పరిస్థితిని అంచనా వేయాలి.

● అదుపులేని టిప్పర్లు

ఇసుక, కంకర, మట్టి రవాణా టిప్పర్లు ప్రమాదకరంగా మారాయి. అధిక లోడ్లతో దూసుకుపోతున్నాయి. క్యాబిన్ మినహా టిప్పర్ మొత్తం సరుకుతో నింపేస్తున్నాయి. దీంతో రోడ్లు కూడా ఛిద్రం అవుతున్నాయి.

● రెండు కుటుంబాల్లో చీకటి



మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు (మృతుల పాతచిత్రం)

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం దివాన్‌చెరువు పరిధిలోని రఘునాథపురానికి చెందిన రేలంగి శివన్నారాయణ(40)కు భార్య దేవి లలిత(34), కుమార్తెలు వేదహర్షిత(13),వర్షిత(13), కొడుకు మహిధర్ సత్యకుమార్. హర్షిత, వర్షిత కవలలు కావడంతో ఆధార్ వేలిముద్రల సమస్య ఏర్పడగా పరిష్కారం నిమిత్తం ఈఏడాది జూన్ 2న కాకినాడ కలెక్టరేట్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. వీరి వెంట శివన్నారాయణ బావమర్ది తీగిరెడ్డి శివ(30), శివ సతీమణి భవాని (26), కుమార్తె సాన్వి(4) కూడా ఉన్నారు. వీరంతా రంగంపేట మండలం వడిశలేరు సమీపంలోకి రాగా కారు లారీని వెనుకనుంచి బలంగా ఢీకొంది.ఈ ఘటనలో శివన్నారాయణ, దేవిలలిత, హర్షితలతోపాటు శివ, సాన్వి మరణించారు. ఈ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. తల్లిదండ్రులతోపాటు సోదరిని కోల్పోయి వర్షిత, మహిధర్ చెల్లాచెదురయ్యారు.వర్షిత అమ్మమ్మ దగ్గర కవలగొయ్యిలో ఉంటూ 8వతరగతి చదువుతోంది.తాత ఆరోగ్యం బాగోక మంచాన పట్టాడు. మహిధర్ రాజమహేంద్రవరంలో పెద్దమ్మ దగ్గర ఉండి టెన్త్ చదువుతున్నాడు.ఇంకోకుటుంబంలో శివ, అతడి కుమార్తె సాన్వి చనిపోయారు. భార్య భవాని గాయాలతో బయటపడి భర్త,కుమార్తె లేకపోవడంతో మనోవేదనకు గురవుతోంది.



● కుమార్తె, మనువరాలిని కోల్పోయి..



తాళ్లరేవు ప్రమాద ఘటన

(కాకినాడ-ఆంధ్రజ్యోతి): తాళ్లరేవుమండలం పైడా ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఈ ఏడాడి జూలై 25న ఓ ప్రైవేటు ట్రావెల్స్‌బస్సు ఓ ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో యానాం కురసాంపేటకు చెందిన ఆటోడ్రైవర్ కూరాకులకుమార్(30), కాకినాడ ఏటిమొగకు చెందిన తల్లీకూతుళ్లు పోతాబత్తుల దుర్గ(55), లంకే భవానీ(35) అక్కడికక్కడే మృతిచెందగా ఓలేటి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ఒకేసారి కుమార్తె, మనువరాలిని కోల్పోయిన దుర్గ తల్లి లంకే ధనలక్ష్మి విలపిస్తోంది. తన మనుమరాలి పిల్లలు ఇద్దరూ అనాథలయ్యారని, ఇదే ప్రమాదంలో గాయపడిన తన చిన్నకుమార్తె లక్ష్మి పూర్తిగా మంచానపడిందని, ఆమెకు నాలుగు ఆపరేషన్లు అయ్యాయని విలపించింది. తమకు ఇప్పటికీ ఎవరూ ఏసాయం అందించలేదని చెప్పింది.



మనువరాలి ఫొటోతో ధనలక్ష్మి

● తల్లిదండ్రులకు శోకం మిగిల్చి..

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం 216 హైవేపై పాతయింజరం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఈ ఏడాది ఫిబ్రవరి 28న యానాం నుంచి స్పోర్ట్స్ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొనగా వారు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ఒకరు ముమ్మిడివరం టెలిఫోన్ ఎక్ఛేంజ్ వీధికి చెందిన దొమ్మేటి జయఅభినవ్(17) కాగా మరొకరు కర్రివానిరేవు పంచాయతీ పరిధిలోని బూరుగుపేటకు చెందిన మట్టా ఆకాష్‌రెడ్డి(21). ఒక్కగానొక్క కుమారుడి మృతితో జయఅభినవ్ తల్లిదండ్రులు బాధతో కుంగిపోతున్నారు. మట్టా ఆకాష్‌రెడ్డి(21) వారి కుటుంబంలో పెద్ద కుమారుడు. చేతికి అందివచ్చిన కుమారుడి మరణంతో తల్లిదండ్రులు విలపిస్తున్నారు. ప్రయాణంలో హెల్మెట్ ధరించకే తమ కుమారుడు మృతిచెందాడని, అలా ఎవరూ చేయొద్దని తెలిపారు. అతడిస్నేహితులు ముమ్మిడివరంలో హెల్మెట్‌లు పంచారు.

'కొండంత అండను కోల్పోయాం'

(ఏలేశ్వరం-ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరంలో హైవేపై ఈనెల 8న ఉదయం అన్నవరం నుంచి వస్తున్న పెళ్లికారు బీభత్సం సృష్టించింది. ఆ సెంటర్‌లో ఉన్న ప్రజలను నిద్రమత్తులో డ్రైవర్ వేగంగా వచ్చిఢీకొన్నాడు. ఈఘటనలో స్థానికులు మోర్త ఆనందరావు(65), మోర్త కొండయ్య(30)తోపాటు ఏలేశ్వరానికి చెందిన కాకాడ రాజు(45) మృతి చెందారు. వీరిలో బొప్పాయిలు అమ్ముకునే కాకాడ రాజుకు ఆరుగురు సంతానం. తన తండ్రి కుటుంబానికి కొండంతఅండగా ఉండేవాడని, వయసు మీదపడినా కాయకష్టం చేస్తూ చేదోడుగా ఉండేవాడని, ఆయన దూరం కావడాన్ని తట్టుకోలేకపోతున్నామని కుమారుడు ఏసుబాబు వాపోయాడు.

కాకినాడ జిల్లాలో... 867 ప్రమాదాలు 355 మరణాలు

కాకినాడ జిల్లాలో ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. బైక్‌పై వెళ్తున్న వారిని లారీ ఢీకొనడం, నడిచి వెళుతున్న వారిపై నుంచి కారు దూసుకెళ్లడం వంటివి జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో గడిచిన 11 నెలల్లో పలు ప్రమాదాలు అనేకమందిని ఆసుపత్రి పాల్జేశాయి. జనవరిలో 1482 మంది, ఫిబ్రవరిలో 1365 మంది, మార్చిలో 54 మంది, ఏప్రిల్‌లో 20మంది, మేలో 60మంది, జూన్‌లో 88మంది, జూలైలో 117మంది ఆగస్టులో 682 మంది, సెప్టెంబర్‌లో 260 మంది అక్టోబర్‌లో 195 మంది వివిధ రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలైనట్టు జీజీహెచ్ రికార్డుల్లోని లెక్కలు చెప్తున్నాయి. పోలీసు రికార్డుల ప్రకారం.. జిల్లాలో గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది నవంబర్ మధ్య 867 మేజర్ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 355 మంది మరణించారు. 929 మంది గాయపడ్డారు.

తూర్పు గోదావరిలో.. 636 ప్రమాదాలు 260 మరణాలు

తూర్పుగోదావవరి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. సరాసరిన నెలకు ఒకరు చొప్పున బలవుతున్నారు. జిల్లాలో గతేడాది 30 బ్లాక్ స్పాట్లు ఉండగా.. ఈ ఏడాది 9 నెలల్లో మరో 3 జత కలిసి మొత్తం 33కి చేరాయి. బ్లాక్ స్పాట్లలోనూ జాగ్రత్తలు శూన్యం అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకూ గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలోని 636 రోడ్డు ప్రమాదాలు జరగగా ఏకంగా 260 మంది ప్రాణాలు విడిచారు. 679 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆర్టీసీ బస్సుల వల్ల 19, ప్రైవేటు బస్సులు 9, లారీలు 116, ట్రాక్టర్లు 11, కార్లు 148, ద్విచక్ర వాహనాలు 227, ఆటో రిక్షాలు 44, ఇతర వాహనాల వల్ల 62 ప్రమాదాలు జరిగాయి. అయితే ఈ ఏడాది ఒక్క సెప్టెంబరు నెలలోనే నేషనల్ హైవేలో 10. ఇతర రహదారుల్లో 8 మంది ఊపిరి ఆగిపోగా.. 57 మంది గాయాలపాలయ్యారు.

కోనసీమ జిల్లాలో... 300 ప్రమాదాలు 40 మరణాలు

216 జాతీయ రహదారి యానాం నుంచి ప్రారంభమై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సఖినేటిపల్లి వరకు సుమారు 56 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. నిత్యం ఏదో చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలో గత 10 నెలల వ్యవధిలో 300 ప్రమాదాలు జరగ్గా, 40 మంది మృత్యువాత పడ్డారు. 310 మంది పైగా క్షతగాత్రులయ్యారు. జిల్లాలో గడిచిన రెండేళ్ల పది నెలల్లో 450 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందగా 1200 మంది క్షతగాత్రులయ్యారు. 2023లో 590 ప్రమాదాలు జరగ్గా, 210 మంది మృతిచెందగా 442 మంది క్షతగాత్రులయ్యారు. 2024లో 613 ప్రమాదాలు జరగ్గా 153 మంది మృతిచెందగా 402 మంది క్షతగాత్రులయ్యారు. 2025లో ఇప్పటి వరకు 300 ప్రమాదాలు జరగ్గా 40 మంది మృతిచెందగా 300 మంది క్షతగాత్రులైనట్టు సమాచారం.

సత్యదేవుడి సన్నిధికి పోటెత్తిన భక్తులు



అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

- ఒక్కరోజే సుమారు 12 వేల వ్రతాలు
- లక్ష మార్కు దాటిన సత్యదేవుడి కార్తీకం వ్రతాలు


అన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం సత్యదేవుడి సన్నిధికి కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా శనివారం భక్తులు పోటెత్తారు. ఈ ఏడాది కార్తీకమాసంలో తొలిసారి 10వేల మార్కుదాటి 11,647 వ్రతాలు ఒక్కరోజే జరగడం విశేషం. దీంతో శనివారంతో సత్యదేవుడి కార్తీకమాస వ్రతాల సంఖ్య 1,15,086కు చేరింది. కార్తీకం ముగియడానికి నాలుగ రోజులు సమయం ఉండగా 1,35,000 జరగవచ్చనని అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఒంటి గంట నుంచి వ్రతాలు, రెండు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. సత్యదేవుడి అంతరాలయ దర్శన టిక్కెట్ల విక్రయాలు పూర్తిగా నిలుపుదల చేశారు. యంత్రాలయ దర్శనం నిలుపుదల చేసి లఘుదర్శనానికి పరిమితం చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనం వ్రతాలకు సుమారు 4గంటల సమయం పట్టడంతో ఉపవాసంతో వ్రతం చేసుకున్న భక్తులు అవస్థలు ఎదు ర్కొన్నారు. చైర్మన్ రోహిత్ పశ్చిమ రాజగోపురం వద్ద లిఫ్ట్ సమీపంలో ఉండి రద్దీని నియంత్రణ చేశారు.మరోపక్క వాహనాల పార్కింగ్‌కు స్థలాభావం ఏర్పడడంతో పోలీసులు కొండ దిగువన మైదానంలో వాహనాలను నిలుపుదల చేశారు.నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా భక్తులకు ఉచిత పులిహోర వితరణ చేశారు. మరో పక్క శనివారం రాత్రికి వివాహాలు ఉండడంతో సత్రం గదుల కేటాయింపు కష్టంగా మారింది.

తుని ఎమ్మెల్యే పూజలు

సత్యదేవుడి సన్నిధిని తుని ఎమ్మెల్యే యనమల దివ్య కుటుంబ సభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేయగా చైర్మన్ రోహిత్ వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంటా విష్ణు తదితరులున్నారు.

రాజమండ్రి అభివృద్ధికి కృషి

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన పరిధిలో కృషి చేస్తున్నానని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. త్వరలో జరగబోయే గోదావరి పుష్కరాల పనులపై శాఖలవారీ సమీక్ష చేయాల్సి ఉందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పుష్కరాలను ఘనంగా నిర్వహించడానికి కార్యాచరణ రూపొందిస్తున్నాయని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజమండ్రి పెద్ద రైల్వేస్టేషన్‌కు రూ.270 కోట్లు నిధులు తెచ్చామని, పుష్కరాల్లోగా పనులు పూర్తి చేయడానికి వీలుగా ప్లాట్‌ఫారమ్స్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, స్టేషన్‌కు ఇరువైపులా అభివృద్ధి పనులు కోసం మూడు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవాలని రైల్వేమంత్రితో మాట్లాడానని అన్నారు. కొవ్వూరులో రెండు రైళ్లకు, అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టు తెచ్చామన్నారు. పొగాకు రైతుల సమస్యను దృష్టిలో పెట్టుకుని వారితో సమావేశమయ్యేందుకు ఈనెల 28, 29 తేదీల్లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఇక్కడకు వస్తున్నారన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ వద్ద లైట్లు, సర్వీసు రోడ్ల నిర్మాణంపై కేంద్ర మంత్రి గడ్కరీతో మాట్లాడామన్నారు. మొంథా తుపాను వల్ల నష్టపోయిన పంటలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అనకాపల్లి-దివాన్ చెరువు ఎన్‌హెచ్ 16 ఆరులేన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పార్టీ నాయకులు, ఎప్పటికప్పుడు సమస్యలను తన దృష్టికి తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల వనసమారాధన

శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్‌కు రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి సుభాష్



అమలాపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం వద్ద ఈ నెల 16న ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ నాలుగో కార్తీక వనసమారాధన ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సంఘ పెద్దలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 2లక్షల మంది వనసమారాధనకు హాజరవుతారన్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్ చైర్మన్ సత్యం మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉభయ రాష్ట్రాల నుంచి 300 బస్సులు, కార్లలో పెద్దసంఖ్యలో సంఘీయులు రానున్నట్టు తెలిపారు. అట్టడుగున ఉన్న సంఘీయులను ఆదుకునేందుకు మంత్రి సుభాష్ రూ.కోటి విరాళం ప్రకటించారని, సోమవారం నాటికి ఎస్ఏఎఫ్ ఖాతాలో ఆ నిధులు జమవుతాయన్నారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా జరిగే ఈ ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, వాసంశెట్టి చినబాబు, రాయుడు సత్యరుషి, దొంగ శ్రీను, గుత్తుల నాగేశ్వరరావు, చొల్లంగి వెంకటరమణ, మామిడిశెట్టి శివరామప్రసాద్ పాల్గొన్నారు.

తాళం వేసున్నా దోచేస్తారు..

- ● దొంగతనాలు చేస్తున్న ముగ్గురిని పట్టుకున్న కాకినాడ పోలీసులు
- ● చోరీ సొత్తు కొనుగోలు చేసే మరో ఇద్దరి అరెస్ట్
- ● రూ.42.60 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల స్వాధీనం



చోరీ సొత్తును పరిశీలిస్తున్న కాకినాడ జిల్లా ఎస్పీ

తాళం వేసి ఉన్న ఇళ్లను కొల్లగొడుతూ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పట్టుకోవడంతో పాటు పాటు ఆ చోరీ సామగ్రిని కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రూ.42 లక్షల 60 వేలను కాకినాడ జిల్లా పోలీసులు రికవరీ చేశారు. ఈ వివరాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బిందుమాధవ్ మీడియాకు వెల్లడించారు.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలోని కాకినాడ వన్‌టౌన్, త్రీటౌన్, పోర్ట్, ఇంద్రపాలెం, కరప, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో జరిగిన 7 చోరీ కేసులను ఛేదించి ముగ్గురు నిందితులను, ఇద్దరు రిసీవర్లను అరెస్టు చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు. వారి నుంచి రూ.41 లక్షల విలువైన 331 గ్రాముల బంగారాన్ని, రూ.1.60 లక్షల విలువైన కిలో వెండిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇంద్రపాలెం పోలీసులు సీఆర్ నంబర్ 217/2025 కేసులో సుంకర తేజ, సుంకర అచ్యుత వరప్రసాద్, బండి హరిక అనే నిందితులను శనివారం ఉదయం చీడిగ బ్రిడ్జి వద్ద అరెస్టు చేశారని ఎస్పీ తెలిపారు. అలాగే పోర్టు పోలీసులు సీఆర్‌నంబర్ 134/2025 యు/ఎస్ 331(3), 305(ఏ), బీఎన్ఎస్ కేసులో కర్రి నాని, మోది కార్తీక్‌ను శనివారం ఉదయం పర్లోపేట డంపింగ్‌యార్డు సమీపాన అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. వీరితో పాటు నేరాలకు పాల్పడిన ఇంద్రపాలెం పీఎస్ పరిధిలోని కటకం పద్మరాజు, పోర్టు పీఎస్ పరిధిలోని కర్రి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నారని తెలిపారు.

పాత నేరస్తులు.. ఇళ్లల్లో చోరీలు..

తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, బయట కిటికీల వద్ద, షూ స్టాండుల వద్ద దాచిపెట్టిన తాళాలను వెతికి, వాటితో ఇంటిలోకి ప్రవేశించి, దొంగతనాలు చేయడంలో పాతనేరస్తుడు సుంకర తేజ ఆరితేరాడు. అతడు దొంగిలించిన సొత్తును తనకు అన్న వరసైన సుంకర అచ్యుత వరప్రసాద్, బండి హరికకు అమ్ముతూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నాడు. అలాగే పోర్ట్ పీఎస్ పరిధిలో కర్రి దుర్గాప్రసాద్, కర్రి నాని, మోదీ కార్తీక్ ఇంటికి వేసి ఉన్న తాళాలు గుర్తించి, 290 గ్రాముల బంగారం, కిలో వెండి, కొంత నగదు దొంగిలించగా వారి నుంచి 231 గ్రాముల బంగారం, కిలో వెండి రికవరీ చేసినట్టు ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో పాత నేరస్తుడైన కర్రి దుర్గాప్రసాద్ పరారీలో ఉన్నాడని, అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులను లాకర్‌లో భద్రపరచుకోవాలని, ఎల్‌హెచ్ఎంఎస్ ఉచిత పోలీసు సర్వీసును ఉపయోగించుకుని నేరాలు జరగకుండా చూడాలని తెలిపారు. నిందితులను పట్టుకుని చోరీ సొత్తు రికవరీకి ప్రత్యేక కృషి చేసిన కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ దేవరాజ్ మనీష్ పాటిల్, కాకినాడ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణ, కాకినాడ పోర్ట్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్‌కుమార్, కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ చైతన్య, క్రైం ఎస్ఐ బి.వినయ్‌ప్రతాప్, ఇంద్రపాలెం ఎస్ఐ వీరబాబు, పోర్ట్ ఎస్ఐ నరేంద్ర సతీష్‌బాబు, ఏఎస్ఐలు కె.గోవిందరావు, శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు కె.ఎస్.వర్మ, జి.నరసింగరావు, పీఎల్‌వీవీఎస్ ప్రసాద్, బంగార్రాజు, ఆంజనేయస్వామి, కె.వెంకటరత్నాన్ని అభినందించారు.

చోరీలు చేసి.. చలిమంట వేసి!

పట్టుబడ్డ ఇద్దరు దొంగలు

పరారీలో మరొకరు

చింతూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చోరీలు చేసిన దొంగలు చలిమంట కాగుతూ గ్రామస్థుల చేతికి చిక్కారు. వివరాలివి.. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం రాత్రి అటవీ అధికారికి చెందిన ద్విచక్రవాహనం (బుల్లెట్) చోరీకి గురైంది. ఆ వాహనాన్ని చోరీ చేసిన ముగ్గురు అదేరోజు రాత్రి మోతుగూడెనికి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కాటుకపల్లిలో చిన్నపాటి దుకాణాల్లో వస్తువులను చోరీ చేశారు. కాగా రాత్రి చలితీవ్రత అధికంగా ఉండడంతో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ తాటాకింటి సమీపంలో వాహనాన్ని ఆపి ఇంటి పైకప్పు నుంచి తాటాకులు తీసి చలిమంట వేశారు. చలి కాగే సమయంలో ఓ వ్యక్తి కంట ముగ్గురు దొంగలు పడ్డారు. వెంటనే అతడు చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారిని వెంబడించారు. ద్విచక్ర వాహనంతో పాటు ఇద్దరు దొంగలు గ్రామస్థుల చేతికి చిక్కగా, మరో వ్యక్తి పరారయ్యాడు. శనివారం చింతూరు పోలీసుస్టేషన్లో వారిని అప్పగించారు. వీరు ఏలూరు జిల్లా వాసులని తెలిసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కె.గంగవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలాంతరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పామర్రు ఎస్ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలాంతరం గ్రామానికి చెందిన పంపన భాస్కరరావు (72) , విత్తనాల శివప్రసాద్‌తో కలిసి ఎర్రపోతవరం నుంచి బైక్‌పై బాలాంతరం వెళ్తున్నారు. ఈ సమయంలో ద్రాక్షరామ వైపు నుంచి యానాం వెళ్తున్న లారీ వీరు వెళ్తున్న మోటారు బైక్‌ను వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో భాస్కరరావు అక్కడికక్కడే మృతి చెందగా, శివ ప్రసాద్‌కు గాయాలయ్యాయి. భాస్కరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వై.రామవరం: కొంతమూరు బ్రిడ్జి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వై.రామవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దేవరమడుగుల ఫీడర్‌కు చెందిన లైన్‌మెన్ పత్రి ప్రభాకర్ (34)మృతిచెందాడు. ఈయనది మారేడుమిల్లి మండలం నర్సాపురం. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. తోటి ఉద్యోగి మృతితో సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏఈ కె.అబ్బాయిదొర, లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, సిబ్బంది సంతాపం తెలిపారు.

గండి పోశమ్మ ఆలయ దర్శనం తాత్కాలికంగా నిలుపుదల

దేవీపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గొందూరులో వెలసిన స్వయంభూ శ్రీ గండి పోశమ్మ వారి ఆలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్టు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, దీంతో ఎవరినీ అనుమతించమని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు.

రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్‌గా రామారావు ఏకగ్రీవం



వైడి రామారావు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ జిల్లా శాఖ చైర్మన్ వైడి రామారావు రాష్ట్ర శాఖ చైర్మన్‌గా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. దీంతో రామారావు తదుపరి మూడు సంవత్సరాల పదవీ కాలానికి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2025 జనవరి 29వ తేదీన అప్పటి చైర్మన్ రాజీనామాతో ఏర్పడిన ఖాళీలో రామారావు బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అమలాపురం




ప్రత్యేక అలంకరణలో అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారు, విరాళం అందించిన దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు

బాలబాలాజీ దేవస్థానానికి పోటెత్తిన భక్తులు

- స్వామివారికి ప్రత్యేక పూజలు
- శనివారం ఆదాయం రూ.6,63,405

మామిడికుదురు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం కార్తీక బహుళ ఏకాదశి కావడంతో భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులుతీరారు. అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.6,63,405 ఆదాయంగా సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. శనివారం దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని శనివారం రూ.8వేల మంది భక్తులు దర్శించుకున్నారని దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకంలో 5500 మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బంది తలెత్తకుండా సహాయ కమిషనర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా గణపవరానికి చెందిన వాసిరెడ్డి శ్రీనివాస్, వాసిరెడ్డి దుర్గాప్రసన్నకుమార్, మౌనికభాగ్యలక్ష్మి, కలిగొట్ల గ్రామానికి చెందిన తోట రామకృష్ణ-రమాదేవి దంపతులు రూ.లక్షా 40వేలు విరాళం అందించారు. శనివారం భక్తులకు ఈ విరాళంతో అన్నదానం జరిపించాలని కోరినట్టు సహాయ కమిషనర్ తెలిపారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు దాతకు స్వామివారి చిత్రపటంఅందించి అభినందించారు.

భక్తులతో కిటకిటలాడిన సిద్ధివినాయకుడి ఆలయం



క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

అయినవిల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఏకాదశి సందర్భంగా శనివారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయం, ముక్తేశ్వరంలో గల శ్రీముక్తికాంత క్షణముక్తీశ్వరాలయం, రాజరాజేశ్వరి సమేత ముక్తేశ్వరాలయం, అయినవిల్లి అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయం, నల్లచెరువులోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శనాలు చేసుకుని పూజలు చేశారు. క్యూలైన్లు, ఆలయ మండపాల్లో భక్తుల సందడి నెలకొంది.

నారసింహుడిని దర్శించుకున్న భక్తులు

అంతర్వేది, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. స్వామి దర్శనం అనంతరం పుణ్యక్షేత్రంలో ఉన్న ఆలయాలను సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అంతర్వేదిపాలెం బ్రాంచి ఆధ్వర్యంలో వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ డి.సుధీర్‌కుమార్, ఏసీ ఎంకేటీఎస్వీ ప్రసాద్, సూపరింటెండెంట్ విజయసారథి, బ్యాంకు సిబ్బంది కె.షైనీ, ఎ.లక్ష్మణ్, బి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి విశేష పూజలు

కాట్రేనికోన, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరస్వామి ఆలయంలో క్షేత్రపాలకుడు శ్రీరుక్మిణీసత్యభామాసమేతవేణుగోపాలస్వామికి ఏకాదశి సందర్భంగా శనివారం ఆలయ అర్చకుడు సుదర్శనం కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. వేలాది మంది భక్తులు స్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతరం పార్వతీకుండలేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని సుబ్రహ్మణ్యేశ్వరుడు, కనకదుర్గమ్మ, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అక్కల గంగాదేవి, వీరభద్రరావు జ్ఞాపకార్థం హైదరాబాదుకు చెందిన రంకిరెడ్డి కుమారి అన్న సమారాధన నిర్వహించారు.



శ్రీరుక్మిణీసత్యభామాసమేత వేణుగోపాలస్వామి

లక్ష బిల్వార్చన

ఐ.పోలవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బాణాపురం బాణేశ్వరస్వామి ఆలయంలో శనివారం లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. ప్రముఖ పారిశ్రామికవేత్త నల్లా సూర్యప్రకాశరావు, హైమావతి దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు దంపతులు, రాయపురెడ్డి ధనబాబు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుస్వామిని దర్శించుకున్నారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు.



బాణాపురంలో బాణేశ్వరస్వామి

అన్నదాన ట్రస్టుకు విరాళం

మురమళ్లకు చెందిన గోకవరపు రామకృష్ణ దంపతులు వీరేశ్వరస్వామి నిత్య అన్నదాన ట్రస్టుకు రూ.10,116లు శనివారం ఆలయ సిబ్బందికి అందించారు. దాతలకు స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చి ప్రత్యేక దర్శనం కల్పించారు. దాతలను ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అభినందించారు.

వైభవంగా తిరుచ్చిసేవ

అమలాపురం రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బండారులంక శ్రీశ్రీనివాసా బాలమిత్రసంఘం ఆధ్వర్యంలో శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి తిరుచ్చి వాహనసేవ వైభవంగా జరిగింది. పవిత్ర కార్తీకమాసంలో శివకేశవులకు బేధం లేదని ఏకాదశి పర్వదినం శనివారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 500 మంది కళాకారులతో కేరళ వాయిద్యాల నడుమ తిరుచ్చి సేవ భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. వాహన సేవలో దార పొడవునా మహిళలు స్వామి-అమ్మవార్లకు మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మహిళలచే బతుకమ్మల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో బాలమిత్రసంఘం ప్రతినిధులు చింతపట్ల, బీళ్ల విస్సురాజు, అంకం పెదరాజు, ఫణిరాజు, నాగసత్యనారాయణ పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులు

పోటెత్తిన ఆలయాలు



అంబాజీపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శనివారం సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ఏకాదశ రుద్రుల ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాచవరంలో పార్వతీ రాజేశ్వరి స్వామికి లక్షబిల్వార్చనపూజలు నిర్వహించారు. నందంపూడిలో శివుడ్ని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం పల్లిపాలెంలోని పద్మావతీ సమేత వేంకటేశ్వరాలయంలో శనివారం భక్తులతో పోటెత్తింది. కార్తీకమాసం నాల్గో శనివారం పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయంలోని అరుణాచలేశ్వరుని గిరి ప్రదక్షిణ నిర్వహించి అరుణాచలేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలంకరణ

పి.గన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): లంకలగన్నవరంలో ఉన్న శ్రీభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకదాశి పర్వదినం పురష్కరించుకుని శనివారం కార్తీక దీపాలంకరణ గావించారు. ఆలయ మాజీ చైర్మన్ గనిశెట్టి ఈశ్వర్, ఆలయ ప్రధాన అర్చకులు ఖండవల్లి నారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆలయ ప్రాంగణలో దీపాలు ఏర్పాటు చేశారు. స్వామి వారి నామం, శంఖు చక్రాల ఆకారంలో దీపాలు వెలిగించారు. అనంతరం మహిళలు స్వామి వారిని దర్శించుకున్నారు.



గ్రంథాలయాలు

మానసిక వికాస కేంద్రాలు

- డీఈవో సలీంబాషా



అమలాపురం శాఖ గ్రంథాలయంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

అమలాపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలే మానసిక వికాస కేంద్రాలని, ప్రతీ విద్యార్థి గుర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్న గ్రంథాలయాల ప్రాధాన్యం విస్మరించలేమన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధిలో గ్రంథాలయాలే కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. అమలాపురం ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను డీఈవో ప్రారంభించారు. ప్రథమశ్రేణి శాఖ గ్రంథాలయాధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సలీంబాషా మాట్లాడుతూ విజ్ఞాన వికాసానికి జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు పట్టుకొమ్మలన్నారు. ఖాళీ సమయాల్లో గ్రంథాలయాల్లో గడపడం ద్వారా భవిష్యత్‌లో ఎదుర్కొనే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు జ్ఞాన సముపార్జన పొందవచ్చునన్నారు. అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, శారదా కాన్వెంట్, వివిధ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పుస్తక ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, గ్రంథాలయ సిబ్బంది పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, ఆకుల భవానీ, భీమశంకరం, ఎ.నారాయణరావు, మహబూబ్ షకీల, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): పుస్తకాల్లో విజ్ఞానం నిక్షిప్తమై ఉంటుందని గ్రంథాలయాధికారి ఎ.సూర్యనారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్ల భాగంగా రెండో రోజు విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, పుస్తక పఠనం జరిగింది. కార్యక్రమంలో బీడీసీ యెరుబండి కన్నబాబు, కె.జవహర్‌లాల్ పాల్గొన్నారు.

అల్లవరం(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి సెక్రటరీ బోనం కనకయ్య గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ప్రారంభించారు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా పుస్తక పఠన ప్రాముఖ్యం మరింత పెరిగిందని సెక్రటరీ కనకయ్య అన్నారు. గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల చైర్‌పర్సన్ బోనం కనకదుర్గ అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, చీఫ్ లైబ్రేరియన్ ఎం.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకుల ప్రవీణ్, ఎం.శ్రీనివాసరావు, ఎవైఆర్వీ ప్రసాద్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

జీవితానికి మార్గదర్శిని మంచి పుస్తకం

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): ఒక మంచి పుస్తకం పాఠకుల జీవితానికి బంగారు బాట వేస్తుందని ఎంఈవో సత్తి సత్యకృష్ణ అన్నారు. శనివారం భీమనపల్లి, ఉప్పలగుప్తం గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో పుస్తకం పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను వక్తలు వివరించారు. గ్రంథాలయాధికారులు నిమ్మకాయల శేషుకుమార్, సలాది నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో సీఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ కంచుమర్తి బాలాజీ, హైస్కూల్ హెచ్ఎం నూకల సత్యనారాయణ, అద్దంకి అమరేశ్వరరావు, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

వేడుకగా కాపు వనసమారాధన

- హాజరైన కాపు ముఖ్య నేతలు
- పదవులు పొందిన వారికి సత్కారాలు

అమలాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని కాపు కల్యాణ మండపంలో శనివారం ఏకాదశి పర్వదినాన కాపు వనసమారాధన కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. అమలాపురం పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న డాక్టర్ మెట్ల సత్యనారాయణ కాపు కల్యాణ మండపం ఆవరణలో జరిగిన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన కాపు నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అధికార, అనధికార ప్రముఖులు హాజరై విందు భోజనాలు చేశారు. తొలుత ఉసిరి చెట్టు కింద టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి కాపు నాయకులంతా హాజరయ్యారు. ఆ తరువాత వనసమారాధన కార్యక్రమం జరిగింది. కల్యాణ మండపంలో ఇటీవల వివిధ కార్పొరేషన్లతో పాటు ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పదవులు పొందిన పలువురిని మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో కాపు సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. కాపు వనసమారాధనలో వేలాది మంది పాల్గొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రత్యేక రక్షణదళ కమాండెంట్ కొండా నరసింహారావు దంపతులు, వివిధ రాజకీయ పక్షాలకు చెందిన కాపు నాయకులు అల్లాడ స్వామినాయుడు, నల్లా విష్ణుమూర్తి, ఆకుల రామకృష్ణ, కల్వకొలను తాతాజీ, నల్లా పవన్‌కుమార్, చిక్కాల గణేష్, యాళ్ల నాగసతీష్, కంచిపల్లి అబ్బులు, మండేల బాబి, నల్లా చిట్టిబాబు, బొర్రా వెంకటేశ్వరరావు, యేడిద శ్రీను, నల్లా శ్రీధర్, తిక్కిరెడ్డి నేతాజీ, నల్లా స్వామి, ఆర్డీఎస్ ప్రసాద్, నల్లా మల్లిబాబు, పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబు, సలాది బాబూరావు, జంగా అబ్బాయివెంకన్న, యాళ్ల దొరబాబు, రాయపురెడ్డి రాజా, గంధం పల్లంరాజు, ఆశెట్టి ఆదిబాబు, బొర్రా ఈశ్వరరావుతో పాటు పలువురు కాపు నాయకులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్కెస్ట్రా ఏర్పాటుచేశారు.

ఘనంగా శెట్టిబలిజ వన సమారాధన

- 620 మీటర్లు స్థలం పత్రాలు అందజేసిన మల్లాడి

యానాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యానాం ఐక్యశెట్టిబలిజ వన సమారాధన అట్టహాసంగా జరిగింది. ఐక్య శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు చీకట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈవనసమారాధన కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉభయగోదావరి జిల్లాల శెట్టిబలిజ సామాజికవర్గ ముఖ్య నాయకులు రెడ్డి సుబ్రహ్మణ్యం, కుడుపూడి సూర్యనారాయణరావు, గుత్తుల సాయి, పి తాని బాలకృష్ణ, పిల్లి సత్యనారాయణ, కుడిపూడి శివన్నారాయణ, పాలిక శ్రీను తదితర ముఖ్యనాయకులు మాట్లాడారు. ఈసందర్భంగా యానాం ఐక్యశెట్టిబలిజ సంఘ కళ్యాణమండపం భవన నిర్మాణానికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 620 మీటర్ల స్థలాన్ని కొనుగోలుచేసి సంబంధిత డాక్యుమెంట్లను సంఘం ప్రతినిధులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే సంవత్సరంనాటికి ఇదే సం ఘ స్థలంలో భవనం నిర్మాణం చేసుకుని వన సమారాధన నిర్వహించుకునేలా అందరూ సహకరించాలని వ్యక్తలు కోరారు. ముందుగా సంఘం అధ్యక్షుడు చీకట్ల సత్యనారాయణ, తదితర సభ్యులు, వివిధ గ్రామాలకు చెందిన పెద్దలు ఉసిరి చెట్టువద్ద పూజలు నిర్వహించి అనంతరం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.



స్థల పత్రాలను సంఘ సభ్యులకు అందజేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

'పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత'

ఐ.పోలవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్ళ పంచాయతీ పితానివారిపాలెంలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్కూల్ విద్యార్థులతో కలిసి చీపురుతో రోడ్లు ఊడ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తుల సాయి, టీడీపీ మండలాధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు, తెలుగుయువత అధ్యక్షుడు కాకర్లపూడి రాజేష్, దాట్ల పృథ్వీ, గంజా సుధాకర్, ఏలూరి మూర్తి, జంపన బాబు, రాయపురెడ్డి మాణిక్యం, పలివెల త్రినాధరావు, మహదశ లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఉమ్మడిజిల్లా సర్పంచ్ సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. మాచవరం పంచాయతీవద్ద స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, సమాజ పరిశుభ్రత, మూత్రవిసర్జన నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇసుకపూడి పంచాయతీ కార్యాలయంవద్ద సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబూరావు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రపై అవగాహనర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.మమత, కార్యదర్శి కెవీవీ సత్యనారాయణ, నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, ఉపసర్పంచ్ మట్టపర్తి సాంబశివరావు, గోసంగి సత్యనారాయణ, అంగన్‌వాడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో అందరికీ ఆరోగ్యం

ఉప్పలగుప్తం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరికీ ఆరోగ్యం చేకూరుతుందని ఎంపీడీవో జి.కృష్ణ అన్నారు. గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో శనివారం ఆయన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వైద్యఆరోగ్య సిబ్బంది, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, ఏపీవో ఎం.వీరబాబు పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో స్వచ్ఛభారత్-స్వచ్ఛ ఏపీ

అమలాపురం పట్టణంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో శనివారం ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్-స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఏఆర్ హెడ్‌క్వార్టర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పోలీసులు నిర్వహించారు. ఏఆర్ఆర్ఐ కోటేశ్వరరావు, ఆర్ఎస్ఐలు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేశారు. ఏఆర్ ఆర్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ పరిశుభ్రత ఆవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొని శ్రమదానంతో పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.

ముమ్మిడివరం తాలూకా ఎన్జీజీవో యూనిట్ ఎన్నిక

ముమ్మిడివరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీజీవో ముమ్మిడివరం తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా సీహెచ్ఎస్‌సీహెచ్ దొర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముమ్మిడివరంలో జరిగిన తాలూకా యూనిట్ సమావేశంలో కోనసీమ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజశేఖర్ ఎన్నికల అధికారిగాను, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా జి.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా సీహెచ్ఎస్‌సీహెచ్ దొర, గౌరవాధ్యక్షుడిగా డి.రమేష్, ఉపాధ్యక్షుడిగా ఎంఆర్కే ప్రసాద్, వై.ఇందిరాప్రియదర్శిని, డీఎస్ చంద్రబాబు, కార్యదర్శిగా బి.రాజేష్, సంయుక్త కార్యదర్శులుగా వీడీ గాయత్రీ, జె.బాలప్రసన్న, ఎం.గోపి, మహిళా సంయుక్త కార్యదర్శిగా పీవీ రమణి, కోశాధికారిగా ఎం.చిట్టిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- బాధిత కుటుంబాలకు సాయం అందజేసిన ఎమ్మెల్యే గిడ్డి



రూ.2.50 లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

పి.గన్నవరం/మామిడికుదురు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో చెట్టు మీదపడి తీవ్ర గాయాలపాలైన మామిడి కుదురు మండలం పాశర్లపూడి గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, నగరం గ్రామానికి చెందిన ప్రవీణ్‌లను కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్య నారాయణ పరామర్శించారు. రెండు కాళ్లు విరిగిపోయి ఒకరు, కిడ్నీ ఇన్ఫెక్షన్‌తో మరొకరు గత 15రోజులుగా ఐసీయూలో చికిత్స పొందుతున్న ఇరువురిని పరామర్శించి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఇదే విషయంపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తో మాట్లాడి గాయపడిన ఇద్దరు వ్యక్తులను ఆదుకోవాలని కోరారు. స్పందించిన కలెక్టర్ రూ.2.50లక్షల చొప్పున సాయంను మంజూరు చేయడంతో చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందించారు. ఇరువురు త్వరగా కోలుకుంటారని అవసరమైతే ప్రభుత్వం తరుపున పూర్తిసాయం అందించి ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

టీడీపీ హయాంలోనే రోడ్ల అభివృద్ధి: ఎమ్మెల్యే బుచ్చిబాబు



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలోనే రోడ్ల అభివృద్ధి జరుగుతున్నట్టు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్ళ, కేశనకుర్రు, టి.కొత్తపల్లి గ్రామాల్లో రూ.2.44కోట్ల సీసీ రోడ్లకు శనివారం భూమి చేశారు. రూ.1.71 కోట్లతో మురమళ్ళ రామాలయం వీధి, మట్టపర్తివారిపాలెం, పితానివారిపాలెం రోడ్లకు, కేశనకుర్రులో రూ.68.43 లక్షలతో అయిదు రోడ్లకు, టి.కొత్తపల్లిలో రూ.75.20లక్షల రోడ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుత్తులసాయి, టీడీపీ నాయకులు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు కాకర్లపూడి రాజేష్, దాట్ల పృథ్వీ, సర్పంచ్ బీర సత్యకుమారి, వాటర్ డీసీ చైర్మన్ చిలువూరి సుబ్బరాజు, సొసైటీ చైర్మన్ కాకర్లపూడి బుజ్జి, జంపన బాబు, మూర్తి పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ ధరకే పశువుల దాణా పంపిణీ : డాక్టర్ మూర్తి

అమలాపురంరూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచనల మేరకు ఫ్యాక్టరీ ధరకే రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్నట్టు పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లో పశువుల దాణా 50 కిలోలు రూ.1300 వరకు విక్రయిస్తున్నారని చెప్పారు. కలెక్టర్ సూచనలతో 50 కిలోల దాణాను రూ.1020కు రైతులకు ఇప్పించే విధంగా కంపెనీ వారితో ఒప్పందం కుదిరిందన్నారు. వన్నెచింతలపూడి పీఏసీఎస్ కార్యాలయం వద్ద శనివారం సంఘ అధ్యక్షుడు రాంబాబు రాజు, పశువైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ ఆధ్వర్యంలో పశువుల దాణా పంపిణీ చేశారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి రాధాకృష్ణ, ఉపసంచాలకుడు మూర్తి, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ సెంటర్ల విలీనాన్ని ఆపాలి

అంతర్వేది, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ పాఠశాలల్లో ప్రీ స్కూలు పిల్లలు తగ్గిపోతున్నారని, అంగ్‌వాడీ సెంటర్లను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయడం ఆపాలని అంతర్వేదిలో అంగన్‌వాడీ కార్యకర్తలు సచివాలయం వద్ద వినతిపత్రం అందించారు. 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలను రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదై ప్రీస్కూలు బలోపేతానికి కృషిచేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ పిల్లలకు బలవర్ధక పోషకాహారం అందిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. సచివాలయ ఉద్యోగి రాంజీ, కార్యకర్తలు ఎస్తేరురాణి, సూర్యలక్ష్మి, సిబ్బంది శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

పెదపట్నంలంక ధనమ్మపేటలో డెంగ్యూ కేసు నమోదు

- వైద్య ఆరోగ్యశాఖాధికారుల అప్రమత్తం

మామిడికుదురు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంక ధనమ్మపేటలో డెంగ్యూ కేసు నమోదవ్వడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం డీఎంవో నక్కా వెంకటేశ్వరరావు గ్రామంలో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో జ్వర పీడితుల సర్వే నిర్వహించి దోమల నివారణకు ఎబేట్ మందును పిచికారీ చేయించారు. రేవులోనే నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్‌వేసి దోమల వృద్ధిని అరికట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రతీఒక్కరు దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

యానాం సీఐ అడలరసన్ సస్పెన్షన్

- ఐజీపీ ఉత్తర్వులు జారీ



యానాం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తు పుదుచ్చేరి ఐజీపీ డాక్టర్ అజిత్ కుమార్ సింగ్లా ఉత్తర్వులు జారీ చేశారు. యానాంలో ఒక పోక్సో కేసులో నిమిత్తం పాండిచ్చేరి కోర్టుకి వెళ్లి తిరిగి యానాంకి వస్తున్న పోలీస్ వ్యాన్లో సీఐ అడలరసన్ మద్యం, కళ్ళు తాగి డ్యాన్స్ చేస్తున్నారని వీడియోలు పుదుచ్చేరి మీడియాలోను, సోషల్ మీడియాలోనూ హల్చల్ చేశాయి. అయితే నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మేము వెళ్లే వాహనంలో పలువురు అయ్యప్ప స్వామి భక్తులు(సిబ్బంది) ఉన్నారన్నారు. అయితే నేను తాగింది మద్యం, కళ్లు కాదని అది మజ్జిగ మాత్రమేననీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలసరన్ వీడియోద్వారా వివరణను ఇచ్చారు. ఈ అంశం అటు పుదుచ్చేరిలోను, ఇటు యానాం పోలీస్ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. ప్రాథమిక విచారణలో భాగంగా ఈ వీడియోలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలరసన్‌ను సస్పెండ్ చేస్తూ మాహే రీజియన్ ఎస్పీకి రిపోర్టు చేయాలని పుదుచ్చేరి ఐజీపీ ఉత్తర్వులలో పేర్కొన్నారు.


విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

అమలాపురంటౌన్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం ముక్తేశ్వరం గ్రామానికి చెందిన గుబ్బల జోత్స్న అదృశ్యంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు శనివారం తెలిపారు. అమలాపురం శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న జోత్స్న ఇంటి నుంచి కళాశాలకు బయలుదేరింది. కానీ కళాశాలకు చేరుకోలేదని సమాచారం తెలిసిన వెంటనే బంధువులు స్నేహితుల ఇళ్లవద్ద గాలించినా జోత్స్న ఆచూకీ తెలియలేదు. జోత్స్న కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు సెల్ 9440796561, 8143579127కు సమాచారం అందించాలన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

ఉప్పలగుప్తం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 17వ తేదీ నుంచి 26 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జి.కృష్ణ తెలిపారు. ఈనెల 17 నుంచి 21 వరకు భీమనపల్లి జడ్పీ హైస్కూల్, 22, 24, 26 తేదీల్లో ఎస్.కొత్తపల్లి హైస్కూల్, 17 నుంచి 19 వరకు గొల్లవిల్లి సీఎస్ఎం జూనియర్ కళాశాల, 20, 22, 24, 26 తేదీల్లో గొల్లవిల్లి హైస్కూల్, 17 నుంచి 22 వరకు చల్లపల్లి హైస్కూల్, 24 నుంచి 26 వరకు గోపవరం హైస్కూల్లోను ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

'కాల్వలను ఆధునికీకరించండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాల్వలు, రోడ్లకు మధ్య ఉన్న ప్రాంతాన్ని సుందర ప్రదేశంగా తీర్చిదిద్దాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం విశ్వేశ్వరాయపురంలో ఆయన క్యాంపు కార్యాలయంలో అధికారులు, నీటిసంఘ ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ మొదటిదశలో టేకిశెట్టిపాలెం నుంచి సఖినేటిపల్లిలంక వరకు ఉన్న కాల్వలను సుందరీకరణ చేపట్టాలని సూచించారు. అదేవిధంగా ఏటిగట్లు పక్కన వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేసే విధంగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి ముందుగా కార్యక్రమాన్ని పూర్తిచేయాలని పంచాయతీలు, ఇరిగేషన్ శాఖలతో ముందుకు వెళ్లాలన్నారు. నీటి సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వైభవంగా జనార్దనుడి శాంతి కల్యాణం



ఆలమూరు జనార్దనస్వామి ఆలయంలో జరిగిన శాంతి కల్యాణంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఆలమూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో నిర్వహించిన శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. కార్తీకమాసం ఏకాదశి శనివారం కావడంతో నిర్వహించిన స్వామివారి శాంతి కల్యాణంలో జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ మంగతాయారు దంపతులు, బండారు సచిన్ వేద సంహిత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శాంతి కల్యాణాన్ని అర్చకస్వాములు ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, అంగర రంగాచార్యులు, ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవాన్ ఆచార్యులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయానికి విచ్చేసిన బండారు శ్రీనివాస్ దంపతులకు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు అధ్వర్యంలో స్వాగతం పలికారు. ఆలయంలో నారికేళచ్ఛేదన వద్ద జనార్దనస్వామి విగ్రహం, స్వామివారి పాదాలను బండారు శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి విచ్చేసిన కూటమి నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



వెదురుపాకలో సామూహిక సత్యదేవుడి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా సత్యదేవుడి వ్రతాలు

రాయవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక రమా సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యదేవుడి వ్రతాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గీత మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్తీకమాసం ఏకాదశిని పురస్కరించుకుని కొంకుదురు గ్రామానికి చెందిన రమణశర్మ, వైఖానస పండితుడు అంగర జనార్దనాచార్యులు అర్చకత్వంలో సుమారు వంద మంది దంపతులు సామూహిక సత్యనారాయణస్వామి వారి వ్రతాలు జరిపారు. వేద పండితులు సత్యనారాయణస్వామి వ్రత కథతో పాటు వ్రతం విశిష్టత వివరించారు. ఈ సందర్భంగా తాడి వెంకటరెడ్డి, ధనలక్ష్మి దంపతులు, తాడి శ్రీనివాసరెడ్డి బుల్లి వెంకటరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో ఎస్.రామకృష్ణారెడ్డి, నాగులాపల్లి వీరవెంకట సత్యనారాయణ, పడాల శివ మణికంఠరెడ్డి, సత్సంగ సభ్యులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి లక్ష కుంకుమార్చన

కపిలేశ్వరపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలో నున్న పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం అమ్మవారికి లక్షకుంకుమార్చన, గోమాత పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్తీకమాసం నిత్యాభిషేకంలో భాగంగా వేదపండితులు వై.కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకుని మహాకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి స్వరూపిణి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, సకల దేవతా స్వరూపిణి గోమాత పూజలను వేదమంత్రోశ్చరణల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల భక్తులు, మహిళలు, అర్చకులు పాల్గొన్నారు



అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

మండపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండపేట కేపీరోడ్డులోనున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామివారికి జరిగిన ప్రత్యేక ఏకాదశ పూజల్లో పాల్గొన్నారు. కార్తీకమాసం కావడంతో పాటు మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 15, 16, 17 తేదీల్లో మూడు రోజుల పాటు తొలిరోజు శనివారం సామూహిక కల్యాణం, రెండో రోజు ఆదివారం స్వామివారికి పంచామృత అభిషేకం లక్షపత్రి పూజ, 17న వేంకటేశ్వరస్వామికి పవళింపుసేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలకు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని కార్యనిర్వహణాధికారి కామేశ్వరరావు తెలిపారు.

భీమేశ్వర ఆలయంలో ఫ్రాన్స్ అంబాసిడర్ పూజలు

ద్రాక్షారామ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇండియాలో ఫ్రాన్స్ దేశానికి చెందిన అంబాసిడర్ థియరీ మాథౌ శనివారం ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సతీ సమేతంగా సందర్శించారు. ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారు వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమేశ్వరస్వామిని దర్శించుకున్న ఫ్రాన్స్ దేశానికి చెందిన థియరీ మాథౌ దంపతులు

సహకార బ్యాంకుల పాలకవర్గాలు నీతిగా ఉండాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ),నవంబరు 15(ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకుల పాలకవర్గాలు నీతిగా ఉండాలని మాజీ శాసనసభ్యుడు, ది విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరం, జాతీయ సహకార వారోత్సవాలను పురస్కరించుకుని రామచంద్రపురం చెలికాని రామారావు స్మారక భవనంలో సహకార సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో బ్యాంకు జోనల్ మేనేజరు రాగూరు, లీగల్ అడ్వయిజర్ వుండవిల్లి గోపాలరావు, బ్యాంకు డైరెక్టరు చెలికాని కృష్ణమోహన్, వివిధ సహకార సంఘాల అధ్యక్షులు, ఖాతాదారులు పాల్గొన్నారు.



సహకార సదస్సులో మాట్లాడుతున్న ఆంజనేయులు

ఘనంగా బాలల వారోత్సవాలు

కపిలేశ్వరపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాలను నిర్వహించారు. ఈనెల 17 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆయా గ్రామాల్లో విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కపిలేశ్వరపురం, నల్లూరు, వెదురుమూడి ఉన్నత పాఠశాలల వద్ద సదస్సులు, ర్యాలీలు చేశారు. శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ శేషగిరిరావు మాట్లాడుతూ విద్యావంతమైన సమాజం నిర్మించినపుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ, శ్రమ కోఆర్డినేటర్ నాగేశ్వరి, టీచర్లు, శ్రమసంస్థ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురాతన నాణేల ప్రదర్శన

కపిలేశ్వరపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పుస్తక, పురాతన నాణాల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ప్రతిభా పురస్కార గ్రహీత అల్లు రామకృష్ణ సేకరించిన పురాతన నాణాలు, విదేశీ కరెన్సీ, స్టాంపులను ప్రదర్శించారు. వివిధ భాషలకు చెందిన పుస్తకాలను పాఠశాల విద్యార్థులకు, పాఠకులకు ప్రదర్శనగా ఉంచి వాటి గురించి గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్, కార్యదర్శి కె.శివచక్రవర్తి, వీఆర్‌వో సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

20 నుంచి మార్షల్ ఆర్ట్స్‌లో ఉచిత శిక్షణ

ఆత్రేయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం అల్లూరి సీతారామరాజు పార్క్‌లో మార్షల్ ఆర్ట్స్ నిపుణులు జి.అబ్బులు ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు ఆవిష్కరించారు.

పీఎం స్వనిధి చెక్కుల పంపిణీ

మండపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి వీధి వ్యాపారులు ఆత్మనిర్భర్ నిధి పథకంలో భాగంగా మండపేటలో జరిగిన కార్యక్రమంలో 105 మందికి స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం రూ. 27.95 లక్షల చెక్కులను అందజేశారు. వీధి, చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు సాగించుకునేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఉపాధిని మెరుగుపరుచుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గణేశ్వరరావు, నారయ్యబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మందపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మందపల్లికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో భక్తజనం పూజలు జరిపారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,71,318 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.



టేకి గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

రీసర్వేలో లోపాలుంటే దరఖాస్తు చేసుకోండి

ఆర్డీవో అఖిల

కపిలేశ్వరపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా రీ సర్వే అనంతరం తయారు చేసిన డ్రాఫ్టు రికార్డులు ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణలో లోపాలుంటే రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో డి.అఖిల అన్నారు. శనివారం టేకి గ్రామ పంచాయతీ కార్యాలయంలో వీటిపై నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎన్. శ్రీనివాస్, తహసీల్దార్ జి.శ్రీనివాస్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.గౌరీదేవి, ఆర్ఐ బి.అర్జమ్మ, వీఆర్‌వోలు పి.నాగమణి, బి.వెంకటేశ్వరరావు, ఎం.కిరణ్, గ్రామ సర్వేయర్లు జి.వరలక్ష్మి, పుట్టా రామకృష్ణ, పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ బ్లెసన్ సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగ నియామకం

ఆలమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెందిన కానిస్టేబుల్ సుంకర బ్లెసన్ సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం మంజూరు కావడంతో శనివారం ఎమ్మెల్యే సత్యానందరావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందించారు. విధి నిర్వహణలో హైదరాబాద్ వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పటి ఆలమూరు ఎస్ఐ అశోక్‌తోపాటు ఆత్రేయపురంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ బ్లెసన్ మృతి చెందారు. దీంతో కారుణ్య నియామకాల్లో భాగంగా బ్లెసన్ సోదరుడు అలెక్స్ జీవన్‌కు రామచంద్రపురం జూనియర్ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ జారీ అయిన ఉత్తర్వులను ఎమ్మెల్యే అందించారు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరనున్న అలెక్స్ జీవన్‌ను ఆలమూరు టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

మెర్లపాలెంలో అగ్ని ప్రమాదం

ఆత్రేయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మెర్లపాలెంలో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు కుటుంబాలు సర్వం కోల్పోయారు. ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే బండారు పరామర్శించారు. బాధితులైన ములగలేటి వెంకన్న, కొమ్మర సుబ్బలక్ష్మి, ములగలేటి సంతోషం, కుటుంబాలను ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బియ్యం, నగదు, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం తగదు

మండపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేయటం తగదని వైసీపీ సీనియర్ నేత రెడ్డి రాధాకృష్ణ అన్నారు. ఆ పార్టీ పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణలో భాగంగా శనివారం పట్టణంలోని 6వ వార్డులో ఆయన స్థానిక వైసీపీ శ్రేణులతో కలిసి ప్రజల సంతకాలను సేకరించారు. ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తన తీరును మార్చుకుని ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తుందని ఆయన కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్తీక దీపోత్సవం

ద్రాక్షారామ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ బోసుబొమ్మ సెంటర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పారిశ్రామికవేత్త సత్తి సుబ్బారెడ్డి దంపతులు దీన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అర్చకులు కల్లేపల్లి రమేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





మండపేటలో జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీలో పాల్గొన్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు. పక్క చిత్రంలో రావులపాలెం మండలం ఊబలంకలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు

మండపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని వక్తలన్నారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై శుభ్రతకు సహకరించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. మండపేటలో శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టీవీ రంగారావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ దొరబాబు, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాథం, చింతలపూడి సత్తిబాబు, గుండు తాతరాజు, బొడ్డు రామకృష్ణ, కొవ్వాడ అప్పన్నబాబు, కాళ్ల ఆనంద్, బీజేపీ నాయకుడు కోనా సత్యనారాయణ, మున్సిపల్ ఉద్యోగులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మానవహారం

కపిలేశ్వరపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని డీఎల్‌డీవో, మండల ప్రత్యేకాధికారిణి పీవీ విజయలక్ష్మి అన్నారు. శనివారం అంగర పంచాయతీ వద్ద స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అంగర బస్టాండు వద్ద ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. అంగర ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులకు వ్యక్తిగత, సమాజ శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హెచ్.భానూజీరావు, డిప్యూటీ ఎంపీడీవో బి.వరప్రసాద్, గ్రామకార్యదర్శి మోహన్, ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, డ్వాక్రా యానిమేటర్లు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురం మండలం అంగర ర్యాలీలో పాల్గొన్న ప్రత్యేకాధికారి విజయలక్ష్మి

శుభ్రతపై విద్యార్థులు శ్రద్ధ చూపాలి

రావులపాలెం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. రావులపాలెం మండలం ఊబలంకలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల పరిసరాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శుభ్రతపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కె.గంగవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామంలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పుస్తకాలను చదవడం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయంలో ప్రదర్శించిన పుస్తకాలను విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో పామర్రు టీడీపీ నాయకులు మరివాడ సూరిబాబు, వీఆర్వో ఎం.భద్రరావు, ఎంపీపీ మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వీ.రమణ, గ్రంథాలయ పాలకుడు ఎన్.గంగాధర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన

ఆత్రేయపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో శనివారం పుస్తక ప్రదర్శన, వ్యాసరచన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రిటైర్డ్ యూనియన్ బ్యాంకు మేనేజర్ ముత్యాల సూర్యనారాయణ పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. విద్యార్థులు పుస్తక పఠనం నిర్వహించగా, శాఖాధికారిణి శ్రీదేవి నిర్మల పాల్గొన్నారు. ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో తంబా నమ్మశివాయ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు.

మండపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండపేట శాఖ గ్రంథాలయ అధికారిణి పూర్ణమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం కేపీరోడ్డులో రావిచెట్టు వద్ద వున్న గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలపై సీనియర్ పాఠకులు శ్రీనివాస్, మోహన్ వివరించారు.

స్వర్ణోత్సవ సమ్మేళనంలో పాల్గొనడం మరపురాని అనుభూతి

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల 1973-75 బ్యాచ్ పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనంలో పాల్గొనడం మరపురాని అనుభూతి అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య, పారిశ్రామికవేత్త కుంపట్ల నారాయణమూర్తి, ఎమ్మెల్యే బండారు తదితరులు మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు.

టీడీపీ బలోపేతానికి పనిచేయాలి

మండపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమించిన టీడీపీ పట్టణ కమిటీ, దాని అనుబంధ కమిటీలు పార్టీ బలోపేతానికి పనిచేయాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో శనివారం పట్టణ, వార్డు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. దీనికి పార్టీ పరిశీలకుడు గంగిశెట్టి వీవీ సత్యనారాయణ హాజరయ్యారు. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి భవిష్యత్ ఉంటుందని నేతలన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నేతలన్నారు. ఇటీవల మరణించిన టీడీపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ వేగుళ్ల రామ్మోహనకుమార్‌కు సమావేశంలో సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు కాళ్లకూరి స్వరాజ్య భవాని, కాశిన కాశీవిశ్వనాథం, వాదా ప్రసాదరావు, ఎంపీపీ వాసు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యంకు ఆహ్వానంపై హర్షం

మండపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించే ప్రపంచ తెలుగు మహాసభలకు ద్వారపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంకు ఆహ్వానం అందింది. వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించే తెలుగు మహాసభల్లో ఈయన పాల్గొననున్నారు. గుంటూరులో వున్న ఎన్టీఆర్ వేదికపై జరిగే మూడవ ప్రపంచ తెలుగు మహాసభలకు ఆంధ్ర సారస్వత్ పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనువాస్, సమన్వయకర్త, రామచంద్రరాజు, తెలుగు సంఘాల ముఖ్య సమన్వయకర్త కొల్లి రమావతిల నుంచి ఆహ్వానం వచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సవితాల సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి గుణ్ణం శివభాస్కర్, సంస్కృత పండితుడు సుబ్రహ్మణ్యశర్మ, కవి రచయిత బండారు రాము తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఐదుగురిపై బైండోవర్ కేసులు నమోదు

కొత్తపేట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండలం బిళ్లకుర్రు, కొత్తపేట, నక్కావారిపేట, గంటి, గోగివారిపేటకు చెందిన అయిదుగురిపై తహశీల్దారు వై.రాంబాబు సమక్షంలో బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. గతంలో వీరు బెల్ట్‌షాపులు నిర్వహించినట్టు తెలిసిందన్నారు. ముందస్తు చర్యలలో భాగంగా వీరిని బైండోవర్ చేసినట్లు సీఐ తెలిపారు.

కార్తీక వనసమారాధన

రాయవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామంలో శ్రీభక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం, ది ఎలక్ట్రీషియన్స్ ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. యూనియన్ల అధ్యక్షులు కర్రి తాతారావు, బేరా దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఉసిరి చెట్టు వద్ద శివ పార్వతులకు, లక్ష్మీనారాయణులకు పూజలు, హారతులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ కార్తీక వనసమారాధనలు ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో రెండు యూనియన్ల సభ్యులు, కార్మికులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి

రాయవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బిర్సా ముండా జయంతి నిర్వహించారు. హెచ్‌ఎం విప్పర్తి శాంతి సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు మాట్లాడారు. తొలుత బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పించారు.



రాయవరంలో బిర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సెంట్రల్ డెల్టాకు స్కవర్ సూయిజ్ ఆపరేషన్

ఆత్రేయపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ డెల్టా ప్రధాన కాల్వలకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా స్కవర్ సూయిజ్ ఆపరేషన్ నిర్వహించారు. శనివారం బొబ్బర్లంక వద్ద హెడ్‌వర్క్స్ డిప్యూటీ ఇంజనీర్ ఆనంద్ బాబు స్విచ్చాన్ చేసి ఆపరేషన్ నిర్వహించారు. రెండు గేట్లను పైకెత్తి గోదావరి ఎగువ భాగాన్న పేరుకుపోయిన బురదమట్టిని తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా 4,811 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలగా, బురదనీరు గోదావరి దిగువకు ప్రవహించింది. ఈ ఆపరేషన్ ద్వారా ప్రధాన కాల్వల పరిధిలోని పంట కాల్వలకు సాగునీరు సజావుగా ప్రవహిస్తుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ రాధాకృష్ణ, సునీల్‌బాబు, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బొబ్బర్లంక సెంట్రల్ డెల్టా ప్రధాన కాల్వలో స్కవర్ సూయిజ్‌కు స్విచ్చాన్ చేస్తున్న దృశ్యం

పాఠశాల గ్రాంట్స్ బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలి

ఆలమూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు మంజూరైన గ్రాంట్స్ ఎస్టిమేషన్ బిల్లులు త్వరితగతిన ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేసేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనిటరింగ్ అధికారి పి.రాంబాబు సూచించారు. ఆలమూరు విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు బి.అప్పాజీ, ఎస్.రాజుల సమక్షంలో జరిగిన పాఠశాల హెచ్‌ఎంల సమావేశం శనివారం జరిగింది. సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ స్కూల్ కాంపోజిట్ నిధులతోపాటు స్కూల్ కాంప్లెక్స్, ఎంఆర్‌సీ నిధులకు సంబంధించిన బిల్లులు పీఎంశ్రీ యాప్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడు చేయాలన్నారు. పీఎంశ్రీ పాఠశాలలకు సంబంధించిన స్కూల్ కాంపోజిట్ నిధులతో పాటుగా ఇతర బిల్లులు త్వరతగతిన యాప్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జొన్నాడ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.అనంతశ్రీనివాస్‌తో పాటు పలు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.